సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం। 25। ఫిబ్రవరి। 2024



ఏం జరిగింది... ?

రుణం పేరుతో పలువురిని మోసం చేసిన వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. అధికారులు పట్టించుకోవడంలేదు. 8లో



క్షమాపణల రాత్రి..

ముస్లింలు ఆదివారం షబ్-ఏ-బరాత్ (క్షమాపణల రాత్రి) వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం $33^{\circ} / 21^{\circ}$

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం యాగశాలలో చండీహోమం జరిపారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలు చేశారు. చివరగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చండీహోమం పూజలో పాల్గొన్న 19 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కొత్తగూడెంఅర్బన్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ శాసనమండలి నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాను శనివారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల విడుదల చేశారు. శాసనమండలికి జరగనున్న పట్టభద్రుల ఉప ఎన్నికలకు ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 36,926 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిలో పురుషులు 20,900 మంది, మహిళలు 16,026 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో 29 ప్రదేశాల్లో 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముసాయిదా పరిశీలించి, మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. ఏప్రిల్ 4న తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

తునికాకు సేకరణపై అనాసక్తి

మొదటివిడత టెండర్లలో ముందుకురాని కాంట్రాక్టర్లు



తునికాకు

పాల్వంచరూరల్: ఈ యేడాది తునికాకు టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగింది. ఐదు రోజుల క్రితం మొదటి విడత టెండర్ల ప్రక్రియ ముగియగా, కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. దీంతో జిల్లాలో ఒక్క యూనిట్ కూడా అమ్ముడుపోలేదు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ తునికాకు సేకరణకు ఆన్‌లైన్‌లో మొదటి విడతగా ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు టెండరు దాఖలు గడువు ఇచ్చారు. జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 57 యూనిట్లు ఉండగా, తునికాకు సేకరణకు ఎవరూ టెండర్ దాఖలు చేయలేదు. ఈ నెల 26 నుంచి 28 వరకు రెండో విడత, మార్చి 4 నుంచి నుంచి మూడో విడత టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీఎఫ్ఓ తెలిపారు.

అధికారులకు మళ్లీ బదిలీలు?

రేపటిలోపు ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

చుంచుపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ప్రభుత్వశాఖల్లో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసిన అధికారులను ఇటీవల భారీగా బదిలీలు చేశారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వ్యవసాయ, సహకార శాఖల్లో జిల్లా స్థాయి అధికారుల వరకు బదిలీలు చేపట్టారు. జిల్లా నుంచి పక్కా జిల్లాకు, పక్కా జిల్లాల నుంచి ఇక్కడికి పలువురు బదిలీ అయ్యారు. అయితే ఈ బదిలీల విషయంలో పలు సవరణలు చేస్తూ శనివారం కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బదిలీ అయిన అధికారులను గుర్తించి తిరిగి ఈ నెల 26వ తేదీ లోపు మళ్లీ బదిలీ చేయాలని ఆదేశించింది. సొంత జిల్లా ఉన్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్నవారికీ స్థానచలనం కల్పించాలని సూచించింది. తాజా బదిలీల్లో ఎక్కువ మంది అధికారులకు ఒకే లోక్‌సభ పరిధిలో స్థానచలనం కలిగింది. వీరిందరికీ మరోసారి బదిలీ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో ఖమ్మం, మహబూబాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. ఇటీవల జిల్లాకు బదిలీపై ములుగు నుంచి వచ్చిన జెడ్పీ సీఈఓ, ఖమ్మం నుంచి వచ్చిన డిప్యూటీ సీఈఓ, డీఆర్‌డీఓ,అదనపు డీఆర్‌డీఓలతో పాటు పక్క జిల్లాలైన ఖమ్మం, ములుగు, మహబూబాబాద్ వెళ్లిన, అక్కడ నుంచి బదిలీపై వచ్చిన అధికారులకు మళ్లీ స్థానచలనం కలిగే అవకాశం ఉంది.

సింగరేణి సౌరభాలు..

- సోలార్ విద్యుదుత్పత్తిలో నెట్‌జీరో దిశగా అడుగులు
- సంస్థవ్యాప్తంగా ఇప్పటికే 224 మెగావాట్లతో 9 ప్లాంట్లు..
- ఏటా 350 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి
- నేడు కొత్తగూడెంలో మరో ప్లాంట్‌ను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం
- హాజరుకానున్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల తదితరులు



కొత్తగూడెం త్రీఇంక్లైన్‌లో 10.5 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన సౌర విద్యుదుత్పత్తి కేంద్రం

సౌర విద్యుదుత్పత్తిలో సింగరేణి సంస్థ శరవేగంగా అడుగులు వేస్తోంది. తనకు అవసరమైన మొత్తం విద్యుత్‌ను తానే ఉత్పత్తి చేసే (నెట్‌జీరో) దిశగా సాగుతోంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మరో సోలార్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనుంది.

– సింగరేణి(కొత్తగూడెం)

ఇప్పటికే 350 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

సింగరేణి సంస్థ 11 ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్లు, ఇతర అవసరాల కోసం 700 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. 2018లో సౌర విద్యుదుత్పత్తిలో అడుగిడిన సంస్థ 14 సోలార్ ప్లాంట్లను ప్రారంభించాలని నిర్ణయించింది. స్టేజీ-1లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నిర్మించాలని తలపెట్టగా, ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యంతో 9 ప్లాంట్లను ఏర్పాటు చేసింది. తద్వారా సుమారు 350 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. రానున్న మూడేళ్లలో స్టేజీ-2 కింద మరో 400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీంతో మరో 450 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇవి పూర్తయితే సంస్థకు అవసరమైన 700 మిలియన్ యూనిట్లు పోగా మరో 100 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగలనుంది.

రూ. 200 కోట్ల మిగులు..

సంస్థ సౌర విద్యుదుత్పత్తి ద్వారా రూ. 200 కోట్ల ఆదాయం మిగుల్చుకుంది. కంపెనీ ఏటా వినియోగిస్తున్న 700 మిలియన్ యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం నుంచి యూనిట్‌కు రూ. 8 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తోంది. 350 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, ఈమేరకు కొనుగోళ్లు తగ్గిపోయాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ విద్యుదుత్పత్తిలో నెట్‌జీరో దిశగా పయనిస్తోంది. ఇటీవల సింగరేణి భూగర్భ గనులు, సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్లను సందర్శించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో స్టేజీ-2 ప్లాంట్లను ప్రారంభించేందుకు సిద్ధమైంది.

పవన విద్యుదుత్పత్తి యోచన కూడా...

సంస్థ రానున్న మూడేళ్లలో 1000 మెగావాట్ల పవన్ విద్యుత్(విండ్ ఎనర్జీ) ఉత్పత్తి చేయాలనే ఆలోచన కూడా చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల సింగరేణి ఈఅండ్ఎం అధికారులు రాజస్థాన్ వెళ్లి అధ్యయనం చేసి వచ్చారు. రాష్ట్రంలో పవన్ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలంగా ఉన్న మహబూబ్‌నగర్, పరిగి ప్రాంతాలను గుర్తించి ఎంపిక చేసినట్లు తెలిసింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నీటిని అందించే రిజర్వాయర్ నీటిపై ఇప్పటికే 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. తాజాగా మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. కోలిండియావ్యాప్తంగా సింగరేణే తొలిసారిగా ఫ్లోటింగ్ ప్లాంట్ నిర్మించింది. బొగ్గు నిక్షేపాలు క్రమంగా అంతరిస్తుండగా సంస్థ, కార్మికుల మనుగడ కోసం నూతన సాంకేతికతతో, కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నట్లు సింగరేణి సోలార్ విభాగం జీఎం జానకిరామయ్య తెలిపారు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, స్థానికులకు ఉపాధి కల్పించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

నేడు ప్లాంట్‌ను ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి



ప్రారంభించేందుకు సిద్ధం చేసిన ప్లాంట్

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్‌లైన్‌లో 48 ఎకరాల్లో రూ.56.76 కోట్లతో 10.5 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. కాగా కొత్తగూడెంలో ఇప్పటికే త్రీ ఇంక్లైన్, గరిమెళ్లపాడు ప్రాంతాల్లో 37 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు నిర్మించింది. ప్రారంభోత్సవ కార్యక్రమం మధ్యాహ్నం మూడు గంటలకు మొదలవనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎంపీలు పార్థసారథి, వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కాగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏజీఎం సివిల్ రామకృష్ణ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని వైద్య శాఖలో ఖాళీగా ఉన్న 73 పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ నుంచి 28 తేదీ వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత, తదితర వివరాలకు http://kothagudem.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతీ విద్యార్థిపై నిరంతర పర్యవేక్షణ

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో రెండు జిల్లాల ఎస్‌సీఆర్‌పీలతో శనివారం పీఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన బాలబాలికలకు ఇంగ్లిష్‌లో క్లుప్తంగా చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలని తెలిపారు. ఇంగ్లిష్ పదాలు అనర్గళంగా మాట్లాడేలా తీర్చిదిద్దాలని, తెలుగులోనూ గుణింతాలు, పేరాలు చదవగలిగేలా ఉండాలన్నారు. ఈ మేరకు ఎస్‌సీఆర్‌పీలు వారి పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు రమణయ్య, రమేశ్, బిక్యా, వెంకటరత్నం, జయప్రకాష్, రామారావు, ప్రసాద్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమందిర్‌లో ‘ఎన్‌క్వాస్’ పరిశీలన



ఎన్‌క్వాస్ బృందంతో వైద్యాధికారులు, సిబ్బంది

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారాయిగూడెం ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను ఎన్‌క్వాస్ బృందం సభ్యులు శనివారం సందర్శించారు. బృందం సభ్యులు డాక్టర్ రాజేష్ అరోరా, ప్రహ్లాద్ అంబదా గుంజల్ రోగులకు అందుతున్న వైద్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైద్యాధికారులు బాలాజీ నాయక్, స్పందన, పుల్లారెడ్డి, సిబ్బంది దుర్గ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సహస్ర కలశాభిషేకం

కనుల పండువగా శ్రీ రంగనాథస్వామి కల్యాణం



బేడా మండపంలో కలశాల వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీ రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో మాఘమాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్వామివారికి సహస్ర కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవాహనం చేసిన కలశాలతో మంగళ వాయిద్యాలు, మేళతాళాలు నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత బేడా మండపంలో కొలువుదీరిన శ్రీసీతాలక్ష్మణ సమేత రామయ్య స్వామికి ఆవాహనం చేసిన జలాలతో అభిషేకం జరిపారు. హారతులు సమర్పించారు. సహస్ర కలశాభిషేక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. తెలిసీ తెలియక జరిగిన తప్పొప్పుల ప్రాయశ్చితార్థం మాఘపౌర్ణమి రోజున స్వామి వారికి సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని వేదపండితులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పవళింపు సేవ, నిత్యకల్యాణం రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథ కల్యాణం

రామాలయానికి అనుబంధంగా రంగనాయకుల గుట్టపై వేంచేసియున్న శ్రీ రంగనాథ స్వామి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపారు. దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను, కల్యాణ సామగ్రిని రామాలయం నుంచి మేళతాళాల నడుమ రంగనాయకుల గుట్ట ఆలయానికి తీసుకొచ్చారు. అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, మాంగల్య ధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

నేటి నుంచి నిత్యకల్యాణాలు..

సహస్ర కలశాభిషేకోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులపాటు రద్దు చేసిన నిత్యకల్యాణాలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు ఒక ప్రకటన చేశారు. ఆదివారం స్వామివారి నిత్యకల్యాణంతోపాటు తెల్లవారుజామున అభిషేకం జరపనున్నారు. భక్తులు గమనించి స్వామివారి నిత్యకల్యాణంలో యథావిధిగా పాల్గొనాలని కోరారు.

అత్యధిక కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: వచ్చే నెల 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి సూచించారు. శనివారం జిల్లా కోర్టుహాలులో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజీకాదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు, ఈ–పిటీ కేసుల వివరాలను ఠాణాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సాయిశ్రీ, మూడో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె.శివనాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.విజయ్‌కుమార్, ఏపీపీలు విశ్వకాంతి, లావణ్య, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, పోలీస్ అధికారులు, లైజన్ ఆఫీసర్ వీరబాబు, హరగోపాల్ కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నర్సరీలపై షేడ్‌నెట్ తప్పనిసరి

డీఆర్‌డీఓ విద్యాచందన



సుదిమళ్ల నర్సరీలో పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన తదితరులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ నర్సరీల్లో షేడ్‌నెట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని సుదిమళ్ల, సుభాష్‌నగర్, బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీలలో నర్సరీలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల్లో పెంచే మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, ఏపీవో శంకర్, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, అజహర్, రజియా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్‌రూం ఏర్పాటు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఉన్న వినియోగదారులకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాకు, ఇతర సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యుత్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వినియోగదారులు 79016 28365 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

అలనాటి బావికి.. సుందరరూపం!



పగటి పూట కొత్త అందంతో...



వందల ఏళ్ల క్రితమే వాననీటిని ఒడిసిపట్టేలా ఖమ్మం ఖిల్లాలో బావిని నిర్మించారు. ఈ బావిని జాఫర్ బావిగా పిలుస్తుండగా.. కాలక్రమంలో రాజ్యాలు పోయి రాజులూ పోయారు. దీంతో బావి నిర్వహణపై పట్టింపు కరువై శిథిలమవడం మొదలైంది. ఆ తర్వాత ఆ బావి చుట్టూ నివాసాలు ఏర్పడడం.. కాలనీలు పెరగడంతో స్థానికులు చెత్తాచెదారం కూడా అందులోనే వేయడం ప్రారంభించారు. ఫలితంగా కొన్నాళ్లకు బావి నామరూపాలు లేకుండా పోగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) అధికారులు మేల్కొన్నారు. ఈ బావిని సుందరీకరిస్తే మరో పర్యాటక కేంద్రంగా విరాజిల్లడమే కాక.. పురాతన కట్టడాన్ని పరిరక్షించినట్లవుతుందనే భావనతో చేపట్టిన పనులు ఇటీవల పూర్తవడంతో జాఫర్ బావి కొత్త అందం సంతరించుకుంది.. నగర వాసులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది.

– సాక్షి, ఖమ్మం డెస్క్

ఖమ్మం ఖిల్లాపై జాఫర్ బావికి కొత్త అందం

- వందల ఏళ్ల నాటి కట్టడం సుందరీకరణ
- రూ.60లక్షల నిధులు వెచ్చించిన కేఎంసీ
- సహకరించిన ‘రెయిన్ వాటర్ ప్రాజెక్టు’ బాధ్యులు
- ఖమ్మంలో మరో పర్యాటక కేంద్రం సిద్ధం

ఇదీ చరిత్ర...

ఖమ్మం ఖిల్లా దాదాపు నాలుగు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉంటుంది. రెండు కోట గోడలతో ఈ నిర్మాణం వందల ఏళ్ల క్రితం నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. అనంతర కాలంలో జాఫరుద్దౌలా తాలూకాదార్‌గా ఉన్నప్పుడు కోటపై మహల్ నిర్మించారు. ఇక కాకతీయుల కాలంలో ఖిల్లాపై వాననీటిని ఒడిసి పట్టేలా ఒక బావి నిర్మించారు. ఓ పక్క కొండ రాయిని ఆసరాగా చేసుకుని వర్షపు నీరంతా చేరేలా దక్షిణాన లోతట్టు ప్రాంతం ఎంచుకుని ఈ బావి నిర్మాణం జరిగింది. 60అడుగుల పొడవు, 70 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో ఈ బావిని నిర్మించగా... ఆతర్వాత పాలించిన కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీలు బావి చుట్టూ గోడల ఎత్తు పెంచి మరింత పటిష్టం చేశారు. స్థానికంగా ఈ బావికి జాఫర్‌గా బావిగా పేరు స్థిరపడింది.

మరి.. ఆ తర్వాత?

కాలక్రమంలో రాజులు, రాజ్యాలు పోయాక జాఫర్ బావి నిరాదరణకు గురైంది. స్థానికులు చెత్తాచెదారం వేస్తుండడంతో పనికి రాని వస్తువులతో బావి నిండిపోయింది. అయినా చాన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా చారిత్రక, వారసత్వ సంపదగా నిలవాల్సిన బావి నామరూపాలు లేకుండా పోయే పరిస్థితి నెలకొంది.

ఇప్పుడేం చేశారు..

జాఫర్ బావి ఆనవాళ్లు కోల్పోతుందని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) అధికారులు గుర్తించారు. దీంతో వారసత్వ సంపదను భావితరాలకు అందజేయాలని సంకల్పించారు. ఈ మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలతో పురావస్తు శాఖను సంప్రదించారు. బావి పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులకు కేఎంసీ రూ.60లక్షలు వెచ్చించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యాన చారిత్రక బావుల పరిరక్షణతో పాటు వాన నీటి వనరుల సంరక్షణకు కృషి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన ‘రెయిన్ వాటర్ ప్రాజెక్టు’ బాధ్యులు కూడా ఇందులో పాలుపంచుకునేందుకు ముందుకొచ్చారు.

ఆపై సుందరీకరణ


బావి నుంచి మురుగునీరు, చెత్తచెదారం తొలగించాక ఇతర పనులపై కేఎంసీ దృష్టి సారించింది. ఈ సందర్భంగా రెయిన్ వాటర్ ప్రాజెక్టు బాధ్యుల పర్యవేక్షణలో బావి గోడలకు రంగులు వేయించి తీర్చిదిద్దగా పగలు బావి కొత్త అందాలతో కనిపిస్తోంది. ఆతర్వాత లైటింగ్ కూడా అమర్చడంతో రాత్రి వేళ కాంతులు విరజిమ్ముతోంది. సుందరీకరణ పనుల అనంతరం బావిని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పి.నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి తదితరులు ఇటీవల ప్రారంభించారు. దీంతో జిల్లా కేంద్రంలో ఇంకో పర్యాటక కేంద్రం అందుబాటులోకి రాగా.. ఇప్పుడే ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్లు, ఇతర ఫొటో షూట్లు నిర్వహించేందుకు నగర వాసులే కాక జిల్లాలోని వివిధ ప్రాంతాల వారు ఇక్కడకు బారులుదీరుతున్నారు.

చకచకా పనులు

అనుకున్నదే తడవుగా జాఫర్ బావి సుందరీకరణకు కేఎంసీ చకచకా అడుగులు వేసింది. నిధులు మంజూరు చేయడమే కాక గత ఏడాది ఏప్రిల్‌లో పనులు మొదలుపెట్టారు. తొలుత బావిలో నిలిచిన మురుగునీటిని తొలగించేందుకు 7హెచ్‌పీ మోటార్లు రెండింటిని బిగించి 23 రోజులు నిరంతరం నడిపిస్తే బావి ఖాళీ అయింది. ఆతర్వాత 24 మంది సిబ్బందిని పూర్తిగా బావి పనులకే కేటాయించారు. సుమారు 90 రోజుల పాటు వారు నిరంతరం శ్రమిస్తూ సుమారు 2.12లక్షల క్యూబిక్ మీటర్ల చెత్తను తొలగించారు. ఇంకేముంది బావి అసలు రూపం బయటపడింది.



అప్పుడు.. : చెత్తాచెదారంతో నిండిన బావి



ఇప్పుడు.. : రాత్రివేళ లైట్ల వెలుతురులో జాఫర్ బావి

క్లుప్తంగా

సభ ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: బీజేపీ విజయ సంకల్ప యాత్రను ప్రారంభించేందుకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఆదివారం భద్రాచలం రానున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డ్‌లో బహిరంగ సభ నిర్వహించనుండగా శనివారం బీజేపీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. యాత్ర, సభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సన్నె ఉదయ ప్రతాప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మా కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీసీ, ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యాన జిల్లాలోని నిరుద్యోగ యువతకు వృత్తి, విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కోఆర్డినేటర్ సునావత్ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి బూర్గంపాడు, భద్రాచలంలో ఎలక్ట్రిక్, బ్యూటీషియన్ శిక్షణ మొదలు కానుండగా.. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 30 ఏళ్ల వయస్సు ఉన్న వారు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం శిక్షణ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

అటవీ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ఎస్ఎస్‌జీఎస్ సంస్థ కార్యాలయంలో అటవీ వ్యవసాయ పద్ధతులపై గిరిజన ఉప పథకం కింద ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత డాక్టర్ ఏవీ రామాజంజనేయులు ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మండలాల నుంచి 24 మంది రైతలకు ఐటీసీ, ఎంఎస్‌కే సహకారంతో ఎస్ఎస్‌జీఎస్ సంస్థ జామాయిల్ సాగు చేసే రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను తెలిపారు. ఈ సందర్భంగా రామాజంజనేయులు మాట్లాడుతూ.. జామాయిల్, ఆయిల్ పామ్, జీడి మామిడి, కుంకుడు, మామిడి శ్రీగంధం, వివిధ రకాల మొక్కల పెంపకం, వాటిలో లాభసాటిగా సాగు చేయదగిన అంతరపంటలు, నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సతీశ్, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, గణేశ్, అరుణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీల ముసుగులో దళ సభ్యులు?

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో మిర్చి కోతలు కోసేందుకు వచ్చిన వలస కూలీల్లో నలుగురు దళ సభ్యులు ఉన్నట్లు గుర్తించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. దళసభ్యులు ఉంటున్న ప్రాంతాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి ఆ ప్రాంతంలో నాలుగు రోజులుగా సివిల్ డ్రెస్‌లో ఉన్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు తిరిగారు. తర్వాత నలుగురు దళ సభ్యులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకొని ప్రత్యేక వాహనంలో తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అప్రమత్తమైన స్థానిక పోలీసులు శనివారం విస్తృతంగా సోదాలు చేపట్టారు. అనంతారం, గంగారంతండా, గుండెపుడి తదితర గ్రామాల్లో రైతుల మిర్చి తోటలు కోసేందుకు ఛత్తీస్‌ఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వచ్చి పొలాల్లో గుడారాలు, గుడిసెలు వేసుకొని ఉంటున్న వలస కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

పాల్వంచరూరల్: ఆరు రోజుల కిందట ఇంటి నుంచి ఖమ్మం వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. మండలంలోని పనుకుల గ్రామానికి చెందిన బానోతు శ్రీను (42) ఈ నెల 19వ తేదీన ఖమ్మం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదని శ్రీను భార్య కళావతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పల్లెల్లో గుడుంబా తయారీ

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటోంది. శనివారం తుమ్మలచెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు, స్థానికులు చెరువు వద్దకు వెళ్లారు. చెరువు కట్ట సమీపంలో గుడుంబా తయారీకి నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని స్థానికులు గుర్తించారు. బెల్లం పానకాన్ని స్థానికులు పారబోశారు. కుర్వాపల్లి కొత్తూరు, తుమ్మలచెరువులో గుడుంబా విచ్చలవిడిగా తయారు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వెంకటాపురంలో ఇటీవల మహిళలు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి గ్రామంలో గుడుంబా తయారీ, అమ్మకాలు చేయొద్దని తీర్మానించారు.

బంగారం చోరీ

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్‌లో ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు పగలగొట్టి బంగారం చోరీ చేసిన ఘటనపై శనివారం కేసు నమోదైంది. అశోక్‌నగర్‌లో నివాసం ఉండే కమలాకర్ ఈ నెల 21న వైద్యం కోసం పాల్వంచకి వెళ్లి 23న రాత్రి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు, బీరువాలు పగలగొట్టి ఉండటంతోపాటు ఆరు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేశారు.

ఏం జరిగింది.. ఏం జరగబోతోంది?

- తెలియకుండానే మహిళల పేరుపై కరెంట్ అకౌంట్లు
- పట్టించుకోని బ్యాంకర్లు.. పరిధి సాకు చూపుతున్న పోలీసులు
- న్యాయం కోరుతూ ఎమ్మెల్యేను ఆశ్రయించిన మహిళలు



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సమస్యను వివరిస్తున్న బాధితులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం ఇందిరానగర్, సంజయ్‌నగర్ గ్రామాలకు చెందిన మహిళలకు రుణం మంజూరు పేరుతో ఎదురైన మోసం రోజుకో మలుపు తిరుగుతోంది. విచారణ చేపట్టాలన్న మహిళల విననపాన్ని అటు బ్యాంకర్లు పట్టించుకోకపోగా, పోలీసులు పరిధిని సాకుగా చూపడం విస్మయం కలిగిస్తోంది. అసలు ఈ వ్యవహారంలో తప్పెవరిది.. నిందితులెవరు.. అనే కోణంలో విచారించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. ఈ తతంగంలో ఎవరైనా పెద్దల జోక్యం ఉండడంతో ఇలా వ్యవహరిస్తున్నారనే ప్రచారం మొదలైంది.

తప్పని తెలిసినా..

బ్యాంకు ఖాతా తెరవాలన్నా, రుణం మంజూరు చేయించుకోవాలన్నా.. సవాలక్ష ప్రశ్నలు వేసి ధ్రువీకరణ పత్రాలు అడుగుతారు. కానీ ఎలాంటి పరిశీలన చేయకుండా ముఖం కూడా చూడకుండా ఒక బ్యాంకు ఖాతా ప్రారంభించడం.. మరో బ్యాంకు ఏకంగా కరంట్ అకౌంట్‌కు అవకాశం ఇవ్వడం గమనార్హం. ఈనెల 19న ఇల్లెందుకు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు ఇందిరానగర్, సంజయ్‌నగర్ గ్రామాలకు వెళ్లి బాధిత మహిళలను కలిసి విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఆ సమయంలో బాధితులు కల్లూరి సౌజన్య ఖాతాలో రూ.13 లక్షలు, ఎస్‌కే.సల్మా ఖాతాలో రూ.12 లక్షలు, ఎస్‌కే నజియా ఖాతాలో రూ.3 లక్షలు, అఫ్రిన్ ఖాతాలో రూ.3.5 లక్షలు, ఆదిమూల సంధ్య ఖాతాలో రూ.6 లక్షలు ఉండగా, మహిళలు తాము ఖాతాలే తెరవలేదని చెప్పడంతో వాటిని ఫ్రీజ్ చేశారు. సదరు మహిళలు తమకు ఖాతా లేదని చెప్పగా, లావాదేవీలు జరగడంతో బ్యాంకర్లపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

లైసెన్స్‌లు ఎలా వచ్చాయి..?

బాధితుల పేరిట ఇల్లెందు నుంచి పొందిన లైసెన్స్ ఆధారంగా ఖమ్మంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కరెంట్ అకౌంట్ ప్రారంభించారు. రోజువారీ పనులకు వెళ్లే తాము మిర్చి వ్యాపారులుగా నమోదు ఉండడం మిస్టరీగా మారింది. కాగా, సదరు అకౌంట్లలో హరియాణా రాష్ట్రంతోపాటు ఇతర దేశాల నుంచి రూ.లక్షల్లో నగదు లావాదేవీలు జరిగాయి.

ఎందుకీ దాటవేత..

అన్యాయం జరిగిందని మహిళలు రోదిస్తున్నా పోలీసులు తమ పరిధి కాదని దాటవేత ధోరణిలో సమాధానం చెప్పడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవంగా కొటక్ మహీంద్రా బ్యాంకు నుంచి రుణం ఇప్పిస్తామన్న విషయం, ఆ బ్యాంకుతోపాటు మహిళలకు తెలియకుండా ఖమ్మానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్ తెరిచే కాగితాలపై సంతకాలు తీసుకోవడం వరకు ఇల్లెందులో చోటుచేసుకోగా.. మిగతా లావాదేవీలన్నీ ఖమ్మంలో కొనసాగాయి. మొదట అక్రమాలను వెలుగులోకి తెచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు బాధితులకు చెప్పి వదిలేశారు. ఆ తర్వాత మహిళలు ఇల్లెందు పోలీసులను ఆశ్రయిస్తే ఖమ్మంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. తీరా అక్కడకు వెళ్లి బ్యాంకులో సంప్రదిస్తే ఖాతాల్లో రూపాయి లేదని చెప్పడంతో అనుమానాలు రేకెత్తాయి. మూడు రోజుల క్రితం రూ.30 లక్షలు ఉన్నాయన్న అధికారులు ఫ్రీజ్ చేశామని చెప్పి, ఇప్పుడు రూపాయి లేదనడంతో వారు ఖమ్మం పోలీసులను ఆశ్రయించారు. కానీ అధికారులు ఇల్లెందులోనే ఫిర్యాదు చేయాలని చెప్పడంతో తిరిగి ఇల్లెందు వచ్చారు. దీంతో ఎటూ పాలుపోక బాధిత మహిళలు శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈమేరకు ఆయన పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

క్షమాపణల రాత్రి...

- 'షాబాన్' నెలలో మహోన్నత రోజు
- నేడు 'షబ్ ఏ బరాత్'
- ఉపవాస ప్రార్థనలు చేయనున్న ముస్లింలు



కరకగూడెం: ముస్లింలు ఆదివారం 'షబ్ ఎ బరాత్'ను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీనిని 'క్షమాపణ రాత్రి అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని ఎనిమిదో నెలలో ఈ వేడుకలు జరుగుతాయి. షబ్ పదం పర్షియన్ మూలాన్ని కలిగి ఉండగా రాత్రి అని, బరాత్ అనేది మోక్షం, క్షమాపణను సూచించే అరబిక్ పదం. ఈ మేరకు ముస్లింలు ఈరోజు తమ పాపాలకు అల్లాహ్ నుంచి క్షమాపణలు కోరతారు. ఇందుకోసం ఉపవాసం చేస్తారు.

ప్రత్యేక సంప్రదాయాల కలయిక..

సాంస్కృతిక వైవిధ్యం, స్థానిక సంప్రదాయాలపై ఆధారపడి షబ్ ఏ బరాత్ ప్రత్యేక సంప్రదాయాలను కలిగి ఉంటుంది. ఈరోజు పగటిపూట ముస్లింలు తమ పొరుగు వారు, బంధువులకే కాక, పేదలకు రుచికరమైన వంటకాలను తయారు చేస్తారు. అలాగే, చనిపోయిన బంధువులు, కుటుంబీకుల ఆత్మశాంతి కోసం వారి సమాధుల వద్ద ప్రార్థన చేస్తారు. అంతేకాక ఇంకొందరు ఉపవాసం కూడా పాటిస్తారు. అనంతరం రాత్రి వేళ ఉపవాసం ఉండటమే కాక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. కాగా, ఇస్లాంలోని నాలుగు పవిత్ర రాత్రులు ఉండగా, అషురా రాత్రి, షబ్ ఏ మెరాజ్, షబ్ ఏ బరాత్, షబ్ ఏ ఖదర్ వీటిని వ్యవహరిస్తారు.

ప్రార్థన.. క్షమాపణ



షబ్ ఏ బరాత్ ఇస్లామిక్ క్యాలెండర్‌లోని ఎనిమిదో నెల అయిన షాబాన్ నెల 15వ రాత్రి జరుపుకుంటాం. అత్యంత పవిత్రమైన రాత్రిగా పరిగణిస్తారు. చనిపోయినవారి కోసం ప్రార్థించడమే కాక క్షమాపణ కోసం అల్లాహ్‌ను వేడుకుంటాం.

–సయ్యద్ సజ్జాద్ హుస్సేన్, కరకగూడెం

సర్వ శుభాల రాత్రి



ఇది ముస్లింలకు సర్వశుభాల రాత్రి. ఖురాన్ ప్రకారం అల్లాహ్‌ను ఎవరైతే క్షమాపణ కోరుకుంటారో వారిని క్షమించి సన్మార్గంలో నడిపిస్తారు. దీనిని ఆదర్శంగా తీసుకుంటూ సమస్త మానవాళి దైవ మార్గాన్ని అనుసరించేందుకు కృషి చేయాలి.

– మహ్మద్ ఫిరోజ్, జామా మస్జీద్, కరకగూడెం

ఆర్‌సీహెచ్‌పీని సందర్శించిన రైల్వే అధికారులు



ఆర్‌సీహెచ్‌పీని పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)ని శనివారం రైల్వే ఉన్నతాధికారులు సందర్శించారు. సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరవింద్ మాల్దాడే తదితరులు సైడింగ్, బొగ్గు లోడింగ్ పక్రియను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ దినకర్, ఏరియా ఆఫీసర్ మీనాకుమార్, ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, అధికారులు దుర్గాప్రసాద్, ఎస్‌కే కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

బూబీట్రాప్‌లో పడి యువకుడికి గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న జవాన్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటుచేసిన బూబీట్రాప్‌లో (పదునైన ఇనుప చువ్వలతో ఏర్పాటు చేస్తారు) ఓ ఆదివాసీ యువకుడు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా పటేల్‌పారా గ్రామానికి చెందిన యువకుడు సోమ శనివారం కట్టెల కోసం అటవీ ప్రాంతానికి వెళ్తున్న సందర్భంలో బూబీట్రాప్‌లో పడ్డాడు. దీంతో ఆయన కాళ్లకు పదునైన ఇనుప చువ్వలు గుచ్చుకొని తీవ్రగాయాలు కాగా, అతి కష్టం మీద ఆయన గ్రామానికి చేరుకున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న కన్వర్‌గావ్‌లోని సీఆర్‌పీఎఫ్ 85 బెటాలియన్ క్యాంపు పోలీసులు అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

పేపర్ బోర్డులో అగ్నిప్రమాదం

అశ్వారావుపేటరూరల్: స్థానిక జంగారెడ్డిగూడెం మార్గంలోని శ్రీ లక్ష్మీ తులసి ఆగ్రో పేపర్ బోర్డులో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమ వెనుక భాగంలో ఉండే చెత్తాచెదారం, ఇతర వ్యర్థాల ప్రాంతంలో మంటలు అంటుకొని వ్యాపించాయి. అప్రమత్తమైన పరిశ్రమ ఉద్యోగులు స్థానిక అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కొద్ది సేపట్లోనే మంటలను అదుపు చేశారు. కాగా, ఈ ప్రమాదం వల్ల ఎలాంటి నష్టం జరగలేదని, చెత్తా చెదారం మాత్రమే కాలినట్లు పరిశ్రమ సిబ్బంది తెలిపారు.

పది క్వింటాళ్ల మిర్చికి నిప్పు

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం జీపీ దానవాయిపేటలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కల్లంలో ఆరబోసిన మిర్చికి నిప్పంటించడంతో సుమారు 10 క్వింటాళ్ల మిరపకాయలు కాలిపోయాయి. మిర్చికి మంటలు అంటుకున్న విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ఆర్పివేయడంతో రైతుకు నష్టం తప్పింది. దానవాయిపేటకు చెందిన రైతు కుంజా భద్రయ్య రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేసి, మిరపకాయలను కోసి ఇంటికి సమీపంలో ఉన్న పొలంలో ఆరబోశాడు. శనివారం రాత్రి మిర్చి కల్లానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు అంటుకొని మిర్చి ఘాటు వస్తుండటంతో స్థానికులు గుర్తించి మంటలను ఆర్పివేశారు. రెండేళ్ల నుంచి గ్రామంలో ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ఈ ఘటనలపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.54వేలు చోరీ చేసిన సైబర్ దుండగుడు

దుమ్ముగూడెం: మండలంలోని పాతబండారుగూడెం గ్రామానికి చెందిన వర్షా రామకృష్ణ సైబర్ కేటుగాడి వలలో చిక్కుకుని రూ.50,400 నష్టపోయిన ఘటన చోటుచేసుకుంది. రామకృష్ణ మొబైల్ యాప్‌లో లాటరీకి సంబంధించి నాలుగు (ఒక్కోటి రూ.600) టికెట్లు చొప్పున తన కూతురు పల్లవి పేరుపై కొనుగోలు చేశాడు. ఈ నెల 21వ తేదీన సైబర్ నేరగాళ్లు రామకృష్ణకు ఫోన్ చేసి నీకు లాటరీలో రూ.16.80 లక్షలు తగిలాయని, సర్వీస్ టాక్స్ కింద రూ.16,800 పంపాలని సూచించడంతో రామకృష్ణ వెంటనే నగదు పంపించాడు. అదే రోజు మరోసారి కాల్ చేసి మరో రూ.33,600 పంపాలని సూచించడంతో వాటిని కూడా పంపించాడు. అయినప్పటికీ సైబర్ కేటుగాడు ఇంకా ఫోన్ చేస్తూ డబ్బులు పంపించాలని అడుగుతున్నాడు. అనుమానం వచ్చిన రామకృష్ణ పత్తి అమ్మాక వచ్చే డబ్బులు పంపిస్తానని చెబుతూ వచ్చాడు. చివరకి మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ రెండు దఫాలుగా 110163343952 నంబర్‌కు నగదు పంపించాడు.

పాడి గేదెల చోరీ

పినపాక: ఇంట్లో కట్టేసిన పాడి గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మండలంలోని జానంపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామరాజు వ్యవసాయం చేయడంతోపాటు పాడి గేదెలను కూడా పెంచుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న గేదెలను అపహరించారు. ఉదయం లేచేసరికి గేదెలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. రెండు పాడి గేదెలు, రెండు దూడల విలువ సుమారు రూ.1.60 లక్షలు ఉంటుందని రామరాజు వివరించారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి



మాణిక్యమ్మ(ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ మహిళ శనివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని సీతారామనగర్ కాలనీకి చెందిన తమ్మళ్ల మాణిక్యమ్మ(63)పై ఈ నెల 17న గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శనివారం సాయంత్రం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, శవపరీక్ష అనంతరం కుటుంబీకులకు అందించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

తన తల్లిపై అకారణంగా దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మాణిక్యమ్మ కుమారుడు రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 17న ఇంట్లో తన తల్లి ఒకరే ఉన్న సమయాన గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చెవి దుద్దులు, పట్టీలు చోరీ చేసే సమయాన తీవ్రంగా కొట్టారన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని, అనుమానితుల వివరాలు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించాడు. ఈ విషయమై భద్రాచలం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మాణిక్యమ్మపై దాడి జరిగిన రోజే కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో విచారిస్తున్నామని తెలిపారు.

కేసు నమోదు

మణుగూరుటౌన్: కుటుంబ కలహాల కారణంగా అన్నను హత్య చేసేందుకు యత్నించిన తమ్ముడిపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీలోని చేపలమార్కెట్‌కు చెందిన సర్వర్ పాషా (షన్ను) కుటుంబ గొడవల నేపథ్యంలో తన అన్న అబ్దుల్ పాషాను తలపై గాయపరిచి హత్య చేసేందుకు యత్నించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి బురుకలంక అటవీ ప్రాంతంలో మావోయిస్టులు – భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలకు బురుకులంక అటవీ ప్రాంతాన మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం అక్కడ పరిశీలించిన బలగాలు ఓ మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కూంబింగ్ ముమ్మరం చేశారు. కాగా, మృతి చెందిన మావోయిస్టు వివరాలు తెలియాల్సి ఉంది.

ఆత్మహత్యాయత్నం చేసిన యువతి..

దమ్మపేట: ఇద్దరు యువకులు బెదిరించడంతో మనస్తాపం చెందిన యువతి పురుగులమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ నెల 22న బెదిరించారు. దీంతో ఆ యువతి అదేరోజు పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అశ్వారావుపేట, తర్వాత ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బూర్గంపాడు: బూర్గంపాడులోని ఇండియన్ ఆయిల్ బంకు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 ఏళ్లలోపు ఉన్న గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు ప్రధాన కూడలికి సమీపంలోని ఆయిల్ బంకుల వద్ద శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని ఓ వాహనం వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వస్తున్న వాహనాదారులు అతడిని గమనించి లేపేందుకు యత్నించగా అతను అప్పటికే మృతిచెందాడు. యువకుడిని ఏ వాహనం ఢీకొట్టిందో తెలియటం లేదు. ఏఎస్ఐ సత్యనారాయణ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస ఆదివాసీగా భావిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి అతను బూర్గంపాడు పరిసరాలలోనే తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి వద్ద రెండు జతల చిన్నపిల్లల దుస్తులు మాత్రమే ఉన్నాయి. అతడికి సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అశ్వాపురం: మండలంలోని తుమ్మల చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఉదయం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వారు గొందిగూడెం వైపు చెరువులో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్తుతెలియని పురుషుడి మృతదేహం సుమారు 30 నుంచి 35 ఏళ్ల ఉంటాయని, మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే అశ్వాపురం పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రవీందర్ సూచించారు.

గోదావరిలోనూ..

పినపాక: మండలంలోని చింతల బయ్యారం వద్ద గోదావరిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్పయ్య ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, మూడు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని, ఒంటిపై నలుపు రంగు డ్రాయర్ ఉందని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా తప్పిపోయినా, ఈ గుర్తులు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.